నమస్తే తెలంగాణ

ములుగు

జయశంకర్ భూపాలపల్లి

8 | వరంగల్, సోమవారం 19 మే 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# రైతుల గోస కాంగ్రెస్‌కు పట్టదా?

- రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద కాపలా
- ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాతల ప్రాణాల మీదకు తెస్తున్నది
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కొనుగోళ్లలో ఇబ్బందులపై కలెక్టర్‌కు ఫోన్

పర్వతగిరి, మే 18: రైతుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదా.. అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. ఆదివారం పర్వతగిరి మండలం చింతనెక్కొండ, కొంకపాక గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతుల ఇబ్బందులు తెలుసుకుని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు ఫోన్ చేసి వివరించారు. వారి సమస్యలపై తక్షణమే ఆయా శాఖల సిబ్బందితో మాట్లాడుతామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కోసం రోజుల తరబడి ఎదురుచూస్తూ దయనీయ పరిస్థితిలో ఉన్నారని అన్నారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం వారి ప్రాణాల మీదకు తెచ్చిందని పేర్కొన్నారు. సాగు నీళ్లు అందించడంలో, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో, కాంటాలు పెట్టడంలో, ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో, బోనస్ అందజేయడంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండంగా గడుపుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. ఒక వైపు సర్కారు నిర్లక్ష్యం.. మరోవైపు అకాల వర్షాలతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ ఒక్క రైతూ నష్టపోకుండా మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి వారాల కొద్దీ వేచి చూసినా కాంటాలు కావడం లేదన్నారు. టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నదని విచారం వ్యక్తం చేశారు. వివిధ కారణాలు చెప్పి 5 కిలోల దాకా తరుగు తీస్తుండడం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నదని అన్నారు. ఇంటిని వదిలి, రోజుల తరబడి రైతులు వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పి అక్కడే కాపలా కాస్తున్న పరిస్థితి ఉందన్నారు. భారం తగ్గించుకునేందుకు సన్నాలను కొనుగోలు చేయడం లేదని, కొర్రీలు పెడుతూ బోనస్ భారం తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సర్కారు, మిల్లర్లు కలిసి డబుల్ గేమ్ ఆడి రైతులను నిండా ముంచుతున్నారని అన్నారు. 48 గంటల్లో ధాన్యం కొనుగోలు డబ్బులు వేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అన్నారని, ఏ ఊర్లో కూడా పది రోజులు లోపు అమ్మిన పంటకు సంబంధించిన డబ్బులు రావడం లేదని పేర్కొన్నారు. వెంటనే రైతు బీమా డబ్బులు ప్రభుత్వం చెల్లించాలని, చనిపోయిన రైతు కుటుంబాలకు డబ్బులను అందించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు పంట నష్టం చెల్లించాలని, తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసి, కొనుగోళ్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ మనోజ్ కుమార్ గౌడ్, వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్‌రావు, మాజీ ఎంపీటీసీ కరిమిళ్ల మోహన్‌రావు, దబ్బెట యాలాద్రి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గంధం బాలరాజు, చింతనెక్కొండ మాజీ ఉపసర్పంచ్ దర్శోజు దేవేందర్, నాయకులు జీడి గట్టయ్య, మాజీ ఎంపీటీసీలు మౌనిక, సుభాషిణి, డీ నరేశ్, మాజీ సర్పంచ్ జీ రాజు, బీ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్

# ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాడుతాం

- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్
- నగరంలో పలు పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికలు

వరంగల్, మే 18 : ప్రతిపక్షంలో ఉన్నా తాము నిత్యం ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ అన్నారు. ఆదివారం వరంగల్ నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి మహిళలు, యువకులు బీఆర్‌ఎస్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. వారికి వినయభాస్కర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. రాబోయే రోజుల్లో అధికారంలోకి వచ్చేది మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీనే అని, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. ప్రజల ఓట్లతో గెలిచి వారి నమ్మకాన్ని వమ్ము చేసిన వారికి బుద్ధి చెబుతారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల అభీష్టం మేరకు పనిచేసే వారికే బీఆర్‌ఎస్ టికెట్ ఇస్తుందని అన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో డివిజన్‌లో రూ.27 కోట్లతో 344 అభివృద్ధి పనులు చేశామని, 1200 మందికి పెన్షన్లు మంజూరు చేశామని, 500 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందచేశామని వినయభాస్కర్ వివరించారు. ఎన్నికల్లో ఓడినా నేటికీ ప్రజల మధ్య ఉండి పోరాడుతున్నానని అన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన ఉద్యమ నేత కేసీఆర్, బీఆర్‌ఎస్ పోరాటాలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వద్దిరాజు గణేశ్, నాయకులు షఫీ, రమేశ్, చందు, రాజు, నాగమణి, లక్ష్మి, రహీం, శ్రీను, రూపేష్, బుస్సా శేఖర్, శివకుమార్, సాయి ప్రశాంత్, ప్రసాద్, రోహిత్, అభిలాష్, శ్యాంకుమార్, విజయ, అనిత, రంజిత, రాధమ్మ, రేణుక, పావని, జ్యోతి పాల్గొన్నారు.



తాగు నీటి కోసం అరణ్యంలో భక్తుల పాట్లు

## సరస్వతీ పుష్కరాలకు పోటెత్తిన జనం

- వసతులు లేక ఇబ్బంది
- సుమారు 10 కి.మీ మేర ట్రాఫిక్ జామ్
- మార్గమధ్యంలో తాగునీటికి తండ్లాట
- సెల్ సిగ్నల్ లేక హైరానా
- అధికారుల సమన్వయ లోపంతో అస్తవ్యస్తం
- పూజలు చేసిన హైకోర్టు జడ్జి సుధ, సినీ నటుడు రాజేంద్రప్రసాద్



ట్రాఫిక్ కారణంగా మార్గమధ్యంలో బస్సు దిగి నడుచుకుంటూ వస్తున్న భక్తులు

కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు ఆదివారం నాలుగో రోజు భక్తులు పోటెత్తగా, సరైన వసతులు లేక ఇబ్బంది పడ్డారు. ఆలయంలో స్వామి వారి దర్శనానికి గంటల తరబడి క్యూలో నిలబడ్డారు. విసుగు చెంది ఈవోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీఐపీ ఘాట్ వద్ద సరిపడా చలువ పందిళ్లు లేక ఎండ తీవ్రతకు వృద్ధులు, చిన్నారులు విలవిలలాడారు. పోలీసులు వీఐపీల సేవలో తరించగా, అధికారుల నిర్లక్ష్య ధోరణిపై మండిపడ్డారు. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కాగా, భక్తులు నానా పాట్లు పడ్డారు. మార్గమధ్యంలో తాగునీటికి తండ్లాడారు. కొందరు కాలినడకన కాళేశ్వరానికి చేరుకున్నారు. అధికారుల సమన్వయ లోపంతో అంతా అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– మహదేవపూర్(కాళేశ్వరం), మే 18

# భక్తులు ఫుల్.. సౌకర్యాలు నిల్



### ఎవ్వరూ పట్టించుకుంట లేరు

సరస్వతీ పుష్కరాల కోసం కుటుంబంతో కలిసి కాళేశ్వరం అచ్చినం. ఇక్కడ సౌలతులు సక్కగ లేవు. శాన ఇబ్బంది పడ్డం. గింత అధ్వాన్నంగ ఉంటదని అనుకోలే. గుడిల దర్శనానికే 4 గంటలు పట్టింది. అధికారులు ఎవ్వలు పట్టించుకుంటలేరు.

– శ్రీలక్ష్మి, భూపాలపల్లి

కాళేశ్వరం జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. రద్దీకి అనుగుణంగా అధికారులు వసతులు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇసుకలో నడిచేందుకు నరకయాతన పడ్డారు. సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఎటు వెళ్లాలో తెలియక భక్తులు అయోమయానికి గురయ్యారు. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. తాగు నీటి కోసం అరణ్యంలో తండ్లాడారు. వాహనాలు దిగి జాతీయ రహదారి పక్కన ఉన్న జెన్‌కో పైప్ వద్ద లీకే జీ నీటితో దాహార్తిని తీర్చుకున్నారు. కొందరు బైక్‌లపై తిరుగుతూ ఒక్కో వాటర్ బాటిల్‌కు రూ. 50 వసూలు చేస్తూ భక్తులను దోచుకున్నారు. అరణ్యంలో నెట్ వర్క్‌సిగ్నల్ లేక ఇబ్బందులు పడ్డారు. తమ వారి సమాచారం తెలియక బంధువులు హైరానా పడ్డారు.ఓ భక్తుడు వీఐపీ ఘాట్ వద్ద తవ్ర అస్వస్థతకు గురి కాగా, రెస్క్యూ టీం ఆసుపత్రికి తరలించింది. ఇదిలా ఉండగా పుష్కరాల్లో జేబు దొంగలు తమ చేతివాటం ప్రదర్శించడంతో బాధితులు లబోదిబోమన్నారు. కాగా, భక్తులు కాళేశ్వర అందాలను వీక్షించేందుకే జాయ్ రైడ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఒక్కరికీ రూ.4500 చెల్లించి బుకింగ్ చేసుకోవాలన్నారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన భక్తులు

### ప్రముఖుల పూజలు

వీఐపీ ఘాట్ వద్ద త్రివేణి సంగమంలో హైకోర్టు జడ్జి సుధ, సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌తో పాటు భక్తులు పుణ్య స్నానాలాచరించారు. సరస్వతీ మాతకు, సైకత లింగాలకు పూజలు చేశారు. నదీ మాతకు చీర, సారె, ఒడి బియ్యం సమర్పించారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. అనంతరం భక్తులు ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు.



త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

### పుష్కరాల్లో అధికారులు ఫెయిల్



సరస్వతీ పుష్కరాల నిర్వహణలో అధికారులు ఫెయిల్ అయ్యారు. భక్తులకు సరైన సౌకర్యాలు లేవు. పోలీసులు వీఐపీ దర్శనానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గంటల కొద్దీ క్యూలైన్‌లో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నా ఈవో పట్టించుకోకపోవడం సరికాదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– మహేశ్, మంథని



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



నది తీరంలో పూజలు చేస్తున్న మహిళలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ



గుండేటి నరేందర్

- కార్పొరేటర్ గుండేటి నరేందర్ అరెస్టు
- మంత్రి సురేఖకు దూరంగా ఉంటున్న నేత
- 66 ఏండ్ల వ్యక్తిపై అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు
- కార్పొరేటర్‌కు మద్దతుగా స్టేషన్‌కు వచ్చిన ఎమ్మెల్సీ సారయ్య

# అరెస్టు.. హైడ్రామా

## కాంగ్రెస్‌లో సొంత పార్టీ వారిపైనా వేధింపులు

### కాంగ్రెస్ అంటేనే వర్గపోరు

కాంగ్రెస్ అంటేనే వర్గపోరు.. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉన్నాయి. పార్టీలో వర్గ రాజకీయాలు సహజం. నేను కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నా. వర్గ రాజకీయాలు నాకు కొత్తకాదు. ఎన్ని వర్గాలున్నా ఎన్నికల సమయంలో సమష్టిగా పనిచేయడం కాంగ్రెస్ పార్టీకి ఉన్న ప్రత్యేకత. గుండేటి నరేందర్ నీతి, నిజాయితీ కలిగిన వ్యక్తి. మూడు సార్లు కార్పొరేటర్‌గా గెలిచిన నాయకుడు. అలాంటి వ్యక్తిపై కేసులు పెట్టడం బాధాకరం. పోలీసులపై విశ్వాసం ఉంది. విచారణలో నిజానిజాలు బయటికొస్తాయి. పార్టీ దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం మాది, సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు కార్పొరేటర్ నరేందర్ అరెస్టుపై ఆలోచిస్తారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం. తప్పు చేసిన వారిని, సహకరించిన వారికి శిక్ష తప్పదు.

– బస్వరాజు సారయ్య, ఎమ్మెల్సీ

kకరీమాబాద్, మే 18: కాంగ్రెస్ ప్రభుత్వంలో వేధింపుల పరంపర ప్రతిపక్ష నేతలతోనే ఆగడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలకు దూరంగా ఉంటున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలను పోలీసు కేసులతో వేధింపులకు గురిచేస్తున్నారు. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మాజీ రౌడీ షీటర్ పెత్తనాన్ని వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ నేతలపై పోలీసు కేసులతో ఇబ్బంది పెడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొండా సురేఖ గెలుపు కోసం పనిచేసి... ఆ తర్వాత మాజీ రౌడీ షీటర్ వ్యవహారాలను వ్యతిరేకిస్తున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌ను మిల్స్ కాలనీ పోలీసులు అరెస్ట్ చేశారు. 66 ఏండ్ల గుండేటి నరేందర్‌పై అత్యాచార యత్నంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. కాంగ్రెస్ కార్యకర్త నమిండ్ల లావణ్య ఫిర్యాదు మేరకు ఆదివారం ఉదయం కార్పొరేటర్ గుండేటి నరేందర్‌ను మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ సిబ్బంది అరెస్టు చేశారు. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ నరేందర్ అరెస్టుతో వరంగల్ నగరంలో రోజంతా హైడ్రామా జరిగింది. కార్పొరేటర్ నరేందర్‌కు మద్దతుగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హుటాహుటిన పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. కేసు వివరాలను తెలుసుకునేందుకు 3 గంటలపాటు వేచి ఉన్నారు. విచారణ జరుపుతున్నామని, సహకరించాలని పోలీసులు వారికి సూచించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఒక్కొక్కరుగా పోలీసు స్టేషన్‌కు వస్తుండడంతో కార్పొరేటర్ నరేందర్‌ను అక్కడి నుంచి వరంగల్ ఏసీపీ ఆఫీస్‌కు తరలించారు. సాయంత్రం వరకు విచారించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. లావణ్య ఫిర్యాదు చేసిన క్షణాల్లోనే మిల్స్ కాలనీ పోలీసులు నరేందర్‌ను అరెస్ట్ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయనకు పద్మశాలీ కుల సంఘాలు మద్దతుగా నిలిచాయి. గ్రేటర్ వరంగల్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించాయి.

### తూర్పులో అసలు ఏం జరుగుతున్నది..



వరంగల్ తూర్పులో అసలు ఏం జరుగుతున్నది. నియోజకవర్గ పరిధిలో రోజురోజుకూ అట్రాసిటీ కేసులు పెరుగుతున్నాయి. 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై సొంత పార్టీ మహిళా నేత ఫిర్యాదు చేయడం, వేధింపుల కేసు పెట్టడం వెనక మర్మమేంటి? ఏ పార్టీలో ఉన్నా గుండేటి నరేందర్ విలువలతో బతికిన వ్యక్తి. అభివృద్ధిని పక్కన పెట్టి మంత్రి సురేఖ సాగిస్తున్న కక్ష సాధింపు చర్యలో భాగమే ఈ అట్రాసిటీ కేసులా?. కాంగ్రెస్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై పెట్టిన అట్రాసిటీ కేసులో నిజానిజాలను బయటపెట్టాలి. అంతేకాకుండా వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలి.

– నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్యే

### పార్టీ దృష్టికి తీసుకెళ్తాం..

కార్పొరేటర్ గుండేటి నరేందర్ అరెస్ట్ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తాం. జిల్లాలో ఎవరికి ఏ పదవులు ఇచ్చినా జిల్లా అధ్యక్షురాలి హోదాలో నాకు తెలుసు. కార్పొరేటర్‌పై ఫిర్యాదు చేసిన మహిళ తాను డివిజన్ మహిళా అధ్యక్షురాలినని చెప్పుకోవడంపై విచారణ చేస్తాం. కొందరు మంత్రులమని, ఎమ్మెల్యేలమని సైతం చెప్పుకుంటున్నారు. కార్పొరేటర్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన విషయాన్ని తెలుసుకునేందుకే ఇక్కడికి వచ్చాం.

– ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు

### తూర్పులో బతకలేకపోతున్నాం...

తూర్పు నియోజకవర్గంలో కార్యకర్తలు బతకలేకపోతున్నాం. కొంతమంది పార్టీ నాయకుల నుంచి వేధింపులు ఎక్కువవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసిన మమ్ముల్ని కొందరు నాయకులు ఇబ్బందిపెడుతున్నారు. కార్పొరేటర్ స్థాయి వ్యక్తిపైనే ఇలాంటి కక్ష సాధింపులకు పాల్పడితే ఇక సామాన్య కార్యకర్తలు, ప్రజల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలి. ఇలాంటి నాయకులపై పార్టీ అధిష్ఠానంతోపాటు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పరమేశ్వర్, జిల్లా యూత్ అధ్యక్షుడు

# అక్రమ వసూళ్లపై అధికారుల ఆరా

తొర్రూరు, మే 18: డివిజన్ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 28 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న విషయంపై అధికారులు ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలు ధాన్యానికి రూ.2.5 నుంచి రూ.5 వరకు వసూలు చేస్తున్నారని, ఈ క్రమంలో డివిజన్‌లోనే సుమారు రూ.25 లక్షల వరకు వసూలు చేశారని ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు వెంటనే స్పందించారు. ఈమేరకు తొర్రూరు తహసీల్దార్ కార్యాలయంలో వారు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి రైతుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ అక్రమ వసూళ్లపై ఇప్పటికే విచారణ ప్రారంభమైందన్నారు. సొసైటీకి నోటీసులు కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలిపా రు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి అక్రమంగా వసూలు చేస్తే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తొర్రూరు పీఏసీఎస్ వ్యవహారంపై ఇప్పటికే ప్రత్యేకంగా విచారణ ప్రారంభమైందని స్పష్టం చేశారు. మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. సివిల్ సప్లయ్ మేనేజర్ కృష్ణవేణి, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ నరసయ్య, ఆర్ఐ బషీర్ పాల్గొన్నారు.

నమస్తే ఎఫెక్ట్

# రైతుల ధాన్యం మిస్సింగ్‌పై కలెక్టర్ సీరియస్

నష్టపరిహారం ఇస్తామని తెలిపిన రైస్ మిల్లర్

ములుగురూరల్, మే18 : ములుగు మండలంలోని సర్వాపురంలో ఇటీవల రైతులు ధాన్యం బస్తాలు మిస్సింగ్ అయిన విషయంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. శనివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'ధాన్యం కొనుగోళ్లలో నయా దందా' కథనానికి అధికారులు స్పందించారు. ములుగు కలెక్టరేట్‌కు సరస్వతీ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, నష్టపోయిన ఏడుగురు రైతులు, మల్లంపల్లి రైస్ మిల్లర్‌ను పిలిచి విచారణ జరిపినట్లు తెలిసింది. రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడిన కలెక్టర్ రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా, మాయమైన బస్తాల విషయంలో, రైతులు స్వచ్ఛందంగా వడ్లలో తాలు ఉంటే 4 కిలోల చొప్పున కట్ చేసుకోమని సదరు రైస్‌మిల్లర్‌కు చెప్పిగా 10 కిలోల వరకు కోత విధించినట్లు విచారణలో తేలినట్లు తెలిసింది. ఈ విషయంపై కలెక్టర్ సీరియస్ అయ్యి రైతులు నష్టపోకుండా పరిహారం అందించాలని రైస్ మిల్లర్‌ను హెచ్చరించగా ఒప్పుకున్నట్లు తెలిసింది.